క్లుప్తంగా

12న పెదనందిపాడులో ఉచిత వైద్య శిబిరం

పెదనందిపాడు: శ్రీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పీఆర్వో దుర్గావరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్న శిబిరంలో షుగర్, ఎముకలు, కీళ్లు, గ్యాస్ట్రో, బీపీ, బీఎండీ తదితర పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. మండల ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలల తనిఖీ

గార్లపాడు(కాకుమాను): మండలంలోని గార్లపాడు, కొమ్మూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్ని గురువారం ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఆయన చెప్పారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకం అమలు పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు జమాయమ్మ, సురేంద్ర పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కాకుమాను:గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు సెబ్ ఎస్ఐ గీతిక హెచ్చరించారు. మండలంలోని కేబీపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం ఆమె సిబ్బందితో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బొల్లనేని వీరయ్య నుంచి 12 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, అతడ్ని పొన్నూరు సెబ్ స్టేషన్‌కు తరలించారు.

భారత్ బచావో సభను జయప్రదం చేయండి

గుంటూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 11, 12వ తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న భారత్ బచావో సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ పోలిట్ బ్యూరో సభ్యుడు ఎం. హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని ఖండిస్తూ నిర్వహిస్తున్న సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అనాథలకు అన్నదానం



గుంటూరు రూరల్: ఎంవీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొగిలిపువ్వు వెంకటేశ్వరరావు 3వ వర్ధంతి సందర్భంగా గురువారం నగర శివారులోని డంపింగ్ యార్డ్, శాంతి హృదయ్ అనాథ, వృద్ధాశ్రమాల్లో 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బొంతపాడు జేసీఎస్ కన్వీనర్ దారం అశోక్‌కుమార్ మాట్లాడుతూ పేదలు, అనాథలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రూ 12.62 లక్షల అపరాధ రుసుం వసూలు

గుంటూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం గుంటూరు డీ-7 సెక్షన్ గోరంట్ల, జొన్నలగడ్డ, రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో విస్తృత స్థాయి తనిఖీలు చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. విజయకృష్ణ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. శ్రీనివాసబాబు మాట్లాడుతూ 58 మంది అధికారులు, 118 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. 5265 సర్వీసులు తనిఖీ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 234 మందికి రూ. 12.62 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. అనుమతించిన కేటగిరిలో కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఏడు మందికి రూ. 70 వేలు, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 227 మందికి రూ 11.92 లక్షల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, దీనికి ఎవరైనా పాల్పడితే పూర్తి వివరాలతో 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు నేరుగా గానీ లేదా వాట్సప్ ద్వారా గానీ సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో డీఈఈలు ఎం.రవికుమార్, సుబ్బరాయుడు, ఏఈ కె. కోటేశ్వరరావు, ఆపరేషన్ ఏఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏటుకూరు మెయిన్ అంగన్‌వాడీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అర్బన్ సీడీపీఓ కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు, స్థానికంగా నివాసంతో పాటు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన మహిళలు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాసుల్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు గుంటూరు అర్బన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- ఏటుకూరులో రూ 1.13 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం



హెల్త్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మేయర్ కావటి తదితరులు

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని 16వ డివిజన్ ఏటుకూరులో గురువారం రూ 1.13 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని తెలిపారు. జగనన్న చెప్పారంటే ఎట్టి పరిస్థితిలోనైనా దాన్ని చేస్తారని చెప్పారు. ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, విద్య, వైద్యం అభివృద్ధికి ఆయన ముందుంటారని తెలిపారు. పేద ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలనే లక్ష్యంగా అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 560 అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మించారన్నారు. గుంటూరు నగరంలోనే 16 చోట్ల ఏర్పాటు చేశారని, ఒక్కో సెంటర్‌కు కోటి రూపాయలకు పైగా వెచ్చించినట్లు చెప్పారు. ప్రస్తుతం నగరంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ల మరమ్మతుల కోసం రూ. 10 లక్షలను కేటాయించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులోకి తెచ్చి, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు జగనన్న కృషి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం

చైర్మన్ ఖాదర్ బాషా



పెద్ద మసీదును పరిశీలిస్తున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా, అధికారులు, పెద్ద మసీదు ముతవల్లీలు

లక్ష్మీపురం: వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా బోర్డు కృషి చేస్తోందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని పెద్ద మసీదును గురువారం ఆయన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. అనంతరం మసీదు ముతవల్లీలతో సమావేశమయ్యారు. సుదీర్ఘ కాలంగా పెద్ద మసీదుకు చెందిన అనేక ఎకరాల భూమి అన్యాక్రాంతం అవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. బోర్డు పరిధిలో ఉన్న ఎకరం భూమి కూడా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. ఎంతో ఆదాయమున్న చారిత్రాత్మక పెద్ద మసీదు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని వెల్లడించారు. మసీదు భూముల్ని పరిరక్షిస్తామని తెలిపారు. రంజాన్ మాసానికి ముందే మసీదును పూర్తిగా మరమ్మతులు చేయించి సిద్ధం చేయాలని ముతవల్లీలను ఆదేశించారు.

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి అవిరళ కృషి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



గడప గడప కార్యక్రమంలో శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తదితరులు

చేబ్రోలు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలు-5 గ్రామ సచివాలయ పరిధిలో గురువారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా ? అంటూ ఆరా తీశారు. స్థానికంగా డ్రైయిన్లు, విద్యుత్ తీగలు కిందకు రావడం, రోడ్ల సమస్యల్ని స్థానికులు తెలియజేయడంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయాలకు మంజూరైన నిధులతో పాటు ప్రత్యేక నిధులతో గ్రామాభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థానికంగా తెలియజేసిన కొన్ని సమస్యల్ని అక్కడక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా 845 గృహాల్ని పర్యటించి వారికి ప్రభుత్వ లబ్ధిని తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాల్ని అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలుకు శ్రీకారం చుడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. దేశ చరిత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల్ని పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, పి. శ్రీనివాసరావు, గాదె కేశవరెడ్డి, జేసు మేరీ, చౌదయ్య, కె. నాగేశ్వరరావు, ఉల్లం సాంబశివరావు, వై. రంగారెడ్డి, జి.శ్రీరెడ్డి, జి. వెంకట సుబ్బయ్య, బి. అప్పిరెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి



నవ్య మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు



మార్చురీ వద్ద ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

మార్చురీ వద్ద మృతురాలి తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన

పెదకాకాని/ గుంటూరు ఈస్ట్ : మూడు నెలల గర్భిణి అనుమానాస్పద మృతి గందరగోళం, నిరసనలకు దారి తీసింది. పెదకాకాని మండలం గడ్డిపాడుకు చెందిన వీరపనేని మహేష్‌కు, తుళ్లూరు మండలం అనంతవరానికి చెందిన నవ్యతో నాలుగు నెలల క్రితం వివాహం అయింది. ప్రస్తుతం నవ్య మూడు నెలల గర్భిణి. మహేష్ కుటుంబం సమీపంలోని ఆటోనగర్‌లో బైడింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తోంది. మహేష్ దంపతులు ఎప్పటి మాదిరిగానే బుధవారం మధ్యాహ్నం ఆటోనగర్ నుంచి ఇంటికి వచ్చి భోజనం చేశారు. మహేష్ తల్లిదండ్రులకు భోజనం తీసుకు వెళ్లగా, కొంతసేపు నిద్రపోతానంటూ నవ్య ఇంటి వద్దనే ఆగిపోయింది. సాయంత్రం 4 గంటల సమయంలో మహేష్ మరదలు ఇంటికి వచ్చి గదిలో నిద్రిస్తున్న నవ్యను కేకలు వేసింది. ఎంతసేపటికీ పలకక పోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పింది. రెండు వైపులా తలుపులు వేసుకుని గడి పెట్టుకోవడంతో అనుమానం వచ్చి పగులగొట్టి చూడగా అప్పటికే నవ్య ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకు వెళ్లగా మరణించినట్లు వైద్యులు ధ్రువీకరణించారు. సమాచారం అందుకున్న నవ్య కుటుంబసభ్యులు, బంధువులు గడ్డిపాడు చేరుకున్నారు. భర్త మహేష్ నవ్యపై దాడి చేసి చంపేసి, ఉరి వేసుకుందని చిత్రీకరిస్తున్నారంటూ మృతురాలి తండ్రి శానం విజయేంద్రరావు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని రాత్రి గడ్డిపాడుకు తరలించారు. పెదకాకాని పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

జీజీహెచ్ మార్చురీ వద్ద నిరసన

తమ కుమార్తెను అల్లుడు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడంటూ మృతురాలి తల్లిదండ్రులు గురువారం జీజీహెచ్ మార్చురీ ముందు ధర్నా చేశారు. కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలానికి వచ్చి ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. మహేష్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, కఠిన శిక్ష పడేలా చేస్తామని చెప్పి ధర్నా విరమింప చేయించారు. పోస్టుమార్టం అనంతరం వైద్యులు నవ్య మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించడంతో వివాదం సద్దు మణిగింది.

అతిగా సెల్‌ఫోన్ వినియోగంతో అనర్థమే ఎక్కువ

గుంటూరు మెడికల్: సెల్‌ఫోన్లు అవసరమైనంత వరకే ఉపయోగించుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తులతో ఫోన్‌లో పరిచయాలు మంచివి కావని గుంటూరు అర్బన్ సీడీపీఓ టి.కృష్ణవేణి సూచించారు. పలకలూరు రోడ్డులోని కేఎస్ఆర్ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణవేణి మాట్లాడుతూ చదువుకునే వయస్సులో నిర్దేశిత లక్ష్యాన్ని పెట్టుకుని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. దిశ సెంటర్ లాయర్ ఎ.విజయలక్ష్మి మాట్లాడుతూ సైబర్ క్రైం, సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలేజీ డైరెక్టర్ కావూరి విజయ్‌చంద్ మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు చదవడం విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరమని, పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు.

నూతన సాంకేతికతతోనే యువత ప్రగతి

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



ఏఎన్‌యూ: ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత విజయం సాధించాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సదస్సులో వీసీ ప్రసంగించారు. సాంకేతికతను అవసరాలకు తగినంత మాత్రమే ఉపయోగించుకోవాలి తప్పా దానికి బానిస కాకూడదని సూచించారు. వెల్లూరు విట్ డీన్ కె.రమేష్‌బాబు కీలకోపన్యాసం చేస్తూ సమాజ అవసరాలకు తగినట్లుగా కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఇంజినీరింగ్ ఎవర్ గ్రీన్ రంగమని తెలిపారు. నైపుణ్యం, సజనాత్మకతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. నైపుణ్యాల సాధనకు తీవ్రంగా కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ప్రిన్సిపాల్ సిద్ధయ్య, డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను గురువారం వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో బయో మెడికల్ రంగంలో కాంపోజిట్ మెటీరియల్స్‌ను మానవాళికి మరింత ఉపయోగకరంగా మార్చే అంశాలపై ఈ సదస్సులో చర్చ జరగడం మంచి పరిణామని తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. సిద్ధయ్య మాట్లాడుతూ × కాంపోజిట్ మెటీరియల్స్ ఫర్ బయో మెడికల్ అప్లికేషన్స్ । అనే అంశంపై ఈనెల 27, 28 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సదస్సుకు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ కో-ఆర్డినేటర్ సీహెచ్. తిరుమలరావు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. యూరప్, సింగపూర్ దేశాలతోపాటు మన దేశంలోని డీఆర్‌డీఓ , ఐఐటీ నుంచి నిపుణులు హాజరై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం. గోపీకృష్ణ, తౌసీఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



తక్కెళ్లపాడు సమీపంలో కంటైనర్‌ను ఢీకొన్న కారు

పెదకాకాని: ముందు వెళుతున్న కంటైనర్ లారీ షడన్‌గా ఎడమ వైపునకు తిప్పడంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి దాన్ని ఢీకొన్న సంఘటన తక్కెళ్లపాడు సమీపంలో చోటు చేసుకుంది. గుంటూరు జాతీయ రహదారిపై గురువారం విజయవాడ నుంచి చిలుకలూరిపేట వైపునకు కంటైనర్ లారీ వెళుతోంది. అదే సమయంలో వెనుక వస్తున్న కారు తక్కెళ్లపాడు సమీపంలోకి చేరుకునే సరికి కంటైనర్‌ను ఢీకొట్టింది. ఒక్కసారిగా లారీని ఎడమ వైపునకు తిప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారు ఒడిసా రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు.

పెదనందిపాడులో ఇద్దరికి ...

పెదనందిపాడు: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని కొప్పర్రు, తుర్లపాడు గ్రామాల మధ్య గురువారం సాయంత్రం జరిగింది. కొప్పర్రుకు చెందిన దాసరి సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై పొలానికి వెళుతుండగా, అదే గ్రామానికి చెందిన కిలారి రామకృష్ణ ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు, కుడికాలుకు గాయాలయ్యాయి. రామకృష్ణ చెవికి దెబ్బ తగిలింది. బాధితుల్ని గుంటూరులోని హాస్పిటల్‌కు తరలించామని పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడికి..

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో గురువారం జరిగింది. జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన యువకుడు ఎస్. పవన్ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. గుంటూరు నుంచి నారాకోడూరు మీదుగా తెనాలి వైపు కారులో వెళుతూ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. స్తంభం విరిగి తీగల ఆదారం మీద నిలబడటంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో కాళ్లు విరిగిన పవన్‌ను 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఉన్నతితోనే సమాజ ప్రగతి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



ఉత్తమ మహిళా రైతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: మహిళల ఉన్నతితోనే సమాజంలో వెలుగులు సాధ్యమవుతాయని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్ కార్యాలయంలో నాబార్డ్, రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళా రైతు అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీలు తమ కాళ్లపై తాము నిలబడడానికి, స్వయంశక్తికి ప్రభుత్వం సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. మహిళలంతా దాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆమె సూచించారు. అనంతరం మహిళా ఉత్తమ రైతులు, ఉత్తమ మహిళలను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు జనరల్ మేనేజర్ ఎస్.ఎస్.మూర్తి, డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, సీఈఓ కృష్ణవేణి, నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.ఆర్.డి. కార్తీక్, ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ పి.ఎస్.మణి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఫౌండేషన్స్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు, నాబార్డు రీజనల్ ఆఫీస్ హైదరాబాద్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

బోడిపాలెం(కాకుమాను): ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. మండలంలోని బోడిపాలెం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను గురువారం సర్పంచ్ నలిగల ఉషారాణితో కలసి ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. సిబ్బంది ప్రతి రోజూ క్లినిక్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆమె సూచించారు.

నులి పురుగుల నివారణపై అవగాహన నేడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నులి పురుగుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

మత్తుకు బానిసలుగా మారితే భవిష్యత్తు చిత్తు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రామాంజిరెడ్డి

పెదకాకాని: కౌమార దశలో బాలలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్. రామాంజిరెడ్డి సూచించారు. పెదకాకాని మండలం కొప్పురావూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ రామాంజనేయరెడ్డి మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులవుతారని తెలిపారు. డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు, గుండె సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు, మూత్రపిండాలు దెబ్బ తినడం వంటి దీర్ఘకాలిక సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధి, క్యాన్సర్, మానసిక అనారోగ్యం, ఇతర ప్రభావాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమానికి హెచ్ఎం డి. ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచ్ ఆలా సాంబశివరావు, వైద్య సిబ్బంది పి. సంధ్యారాణి, రాజ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, క్రాఫ్ సమన్వయకర్త ఎ.వెంకయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీతో హెచ్‌డీఎఫ్‌సీ ఒప్పందం



ఎంఓయూ పత్రాలను చూపుతున్న వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులు

గుంటూరు రూరల్: విశ్వవిద్యాలయం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ కృషిచేస్తుందని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల వ్యవసాయ ఉత్పత్తిదారులకు సాంకేతిక శిక్షణకు, విశ్వవిద్యాలయంలోని అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల శిక్షణకు, అగ్రి స్టార్టప్‌లకు ఆర్థిక సాయం చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఒప్పంద పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయాభినందన, వ్యవసాయ ఇంజినీరింగ్ పీఠాధిపతి డాక్టర్ ఎ.మణి, విద్యార్థి కార్యకలాపాల పీఠాధిపతి డాక్టర్ పి.సాంబశివరావు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.సుధాకర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రీజినల్ రూరల్ సౌత్ హెడ్ శ్రీధర్, క్లష్టర్ హెడ్ రాజేంద్ర పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

పెదనందిపాడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జీడీసీఎంఎస్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.5330 ప్రకటించిందని పేర్కొన్నారు. రైతులంతా శనగల్ని పెదనందిపాడు మార్కెట్ యార్డు వద్దకు తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.